క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న నూతన కమిటీ సభ్యులు

కొడంగల్ రూరల్: వీఓఏల మండల నూతన కార్యవర్గ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఆ సంఘం నాయకులు తెలిపారు. కమిటీ అధ్యక్షురాలుగా గౌరమ్మ (రుద్రారం), కార్యదర్శిగా విజయలక్ష్మి(హస్నాబాద్), కోశాధికారిగా రమేష్(అప్పాయిపల్లి), ఉపాధ్యక్షుడుగా గణేశ్(పర్సాపూర్), సహాయ కార్యదర్శిగా అంజిలయ్య(రావులపల్లి), సభ్యులుగా నజీర్(రుద్రారం), కవిత(ఎక్కచెరువుతండా), పవన్(లక్ష్మీపల్లి)తో పాటు మరో నలుగురిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉద్యాన శాఖ అధికారిని కలిసిన జాగృతి బృందం



చక్రపాణితో సొసైటీ సభ్యులు

యాలాల: ఉద్యాన శాఖ జిల్లా అధికారి చక్రపాణిని శనివారం జాగృతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(జేఆర్‌డీఎస్) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వచ్చే కార్బన్ క్రెడిట్స్ ప్రాజెక్టు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా దీర్ఘకాలిక పంటలతో పాటు అటవీ జాతి మొక్కలను సాగు చేస్తున్న రైతులకు కార్బన్ క్రెడిట్స్ ద్వారా నగదు ప్రోత్సాహకాలను జాగృతి సొసైటీ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, పుల్లయ్యగౌడ్, గోపాల్, జగ్గప్ప, మురళీ, సంగమేశ్వర్‌గౌడ్, ఎల్లయ్య, నర్సిహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

డైరీ అందజేత



తిరుపతిరెడ్డికి డైరీ అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి ఎస్టీయూ టీఎస్ డైరీని ఆ సంఘం నాయకులు అందజేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వపన్‌కుమార్, సభ్యులు వెంకటరాములు, గోపాల్, కరుణాకర్ మర్యాద పూర్వకంగా కలిసి డైరీని అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామ సర్పంచ్ భర్త లక్ష్మారెడ్డి మృతి చెందడం బాధాకరమని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి బండవెల్కిచర్లలోని సర్పంచ్ శిరీష ఇంటికి వెళ్లి, కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు రాజు, దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి, దోమ సర్పంచ్ రాజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దనొంపులో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న హిందూవాహిని సభ్యులు

కొడంగల్: పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 వారాలుగా హిందూవాహినీ సభ్యులు పూజలు చేస్తున్నారు. శనివారంతో 18వ వారం విజయవంతంగా పూర్తి చేశారు. పూజలో హిందూవాహిని సభ్యులు రాకేష్ కుమార్, భానుప్రకాశ్, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి అభినందనలు

బొంరాస్‌పేట: బదిలీపై మండలానికి వచ్చిన ఎస్ఐ ఎండీ రవూఫ్‌ను శనివారం రెవెన్యూ సిబ్బంది రవినాయక్, ఈర్లపల్లితండాకు చెందిన రవినాయక్ కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

పత్తికి దళారులే దిక్కు!

నిలిచిన సీసీఐ కొనుగోలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

పెద్దేముల్: ఆరుగాలం కష్టపడి పత్తిని పండించిన రైతులకు దళారులే దిక్కవుతున్నారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా శనివారం సీసీఐ కేంద్రంలో సంబంధిత అధికారులు కొనుగోలు నిలిపి వేయడంతో వారు ఆవేదన చెందుతున్నారు. దిగుబడిని విక్రయించేందుకు వాహనాల్లో కొనుగోలు కేంద్రానికి దిగుబడిని తీసుకువచ్చామని, ఇప్పుడు కొనుగోళ్లను ఆపేయడంతో రవాణా, కూలీల ఖర్చు భరించలేక పోతున్నామని వాపోయారు. చేసేది లేక దిగుబడిని దళారులకు విక్రయిస్తున్నామన్నారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా క్వింటా పత్తికి రూ.6,920 నిర్ణయించగా, అదే పత్తిని దళారులు రూ.5,800 నుంచి రూ.6,200 వరకు విక్రయిస్తున్నారని రైతులు తెలిపారు. పత్తి మిల్లులో దిగుబడి నిల్వలు పెరిగాయన్న సాకుతో శనివారం కొనుగోళ్లు నిలిపివేశారని, మళ్లీ ఎప్పుడు కొంటారో తదుపరి తేదీని ప్రకటించకపోవడంతో విధిలేక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించక తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేశారు.

రోడ్డున పడతాం..

మండలంలో పత్తి దిగుబడులు ఆలస్యంగా చేతికి వచ్చాయని, ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఫిబ్రవరి చివరి వరకు కొనసాగించాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు ప్రక్రియ ఆపేస్తే రోడ్డున పడతామని వాపోయారు. ఇప్పటికే మండలంలో దళారులు ఇష్టం వచ్చిన ధరకు పత్తని విక్రయించడమే కాకుండా.. తూకంలో మోసం చేస్తున్నారని ఆరోపించారు. అడిగే వారు లేక వారి ఆటలు కొనసాగుతున్నామని విమర్శించారు. తూనికల అధికారులు నామ మాత్రంగా తనిఖీలు చేయడం, దళారుల ఇష్టారాజ్యం కొనసాగడం షరామామూలైందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వీటన్నింటికీ చెక్ పెట్టాలంటే సీసీఐ కొనుగోలు కేంద్రం వచ్చేనెలాఖరు వరకు కొనసాగించాలని కోరుతున్నారు.



మిల్లులో పేరుకుపోయిన పత్తి నిల్వలు

మళ్లీ ప్రారంభిస్తాం..

ప్రస్తుతం మిల్లులో పత్తి దిగుబడితో పాటు, విత్తనాల స్టాక్ పేరుకుపోయింది. ఈ కారణంగా సీసీఐ కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మళ్లీ కొనుగోళ్లు ప్రారంభిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.
– కాటన్ పర్చేజ్ మండల అధికారి శ్రీనివాస్

ఎలక్ట్రీషియన్ల సేవలు హర్షణీయం

కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ సంపత్ కుమార్

తాండూరు టౌన్: ఎలక్ట్రీషియన్ల సేవలు హర్షణీయమని, నిత్యం ప్రమాదంతో సావాసం చేస్తు, ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తుంటారని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ సంపత్ కుమార్ కొనియాడారు. థామస్ అల్వా ఎడిసన్ విద్యుత్ బల్బును కనుగొన్న దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో జెండా ఎగురేశారు. అనంతరం మాట్లాడారు.

పథకాల్లో ప్రాధాన్యత

అసోసియేషన్ కోసం స్థలం, భవన నిర్మాణ విషయమై ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో మాట్లాడి, మంజూరయ్యేలా కృషి చేస్తానని సంపత్‌కుమార్ హామీ నిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత, ఉపాధి కల్పన, ప్రమాదాలు జరిగినప్పుడు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉండేలా చూస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామ కొండల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ నగేష్, తాండూరు టౌన్ అధ్యక్షుడు నసీరొద్దీన్, జనరల్ సెక్రటరీ నంద కుమార్, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ బషీర్, మైనొద్దీన్, షేక్ ఇస్మాయిల్, సత్యం, అంజి, మున్నా, గౌస్, కృష్ణ, వెంకట్, నారాయణ గౌడ్, రూపేష్, గోపాల్, చిన్నప్ప, లక్ష్మప్ప, ఎండి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రీషియన్ డే వేడుకలు నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు



రేవంత్‌తో కొడంగల్ మండల నాయకులు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన నాయకులు హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి, గ్రామ కమిటీ నాయకుడు గోపాల్‌రెడ్డి సీఎంను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

దుద్యాల శ్రేణులు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం యూత్ కాంగ్రెస్ దుద్యాల మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు రామాంజనేయులు, దేవయ్య, బసప్ప పాల్గొన్నారు.

మండల సర్పంచులు

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డిని ఉమ్మడి బొంరాస్‌పేట మండల పరిధి మహంతీపూర్, లింగన్‌పల్లి, కొత్తూరు, బొట్లోనితండా, మదన్‌పల్లితండాలకు చెందిన సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఇందులో సర్పంచులు మహిపాల్, కాశప్ప, అనంతయ్య ఉన్నారు.



బొంరాస్‌పేట: సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామాంజనేయులు



బొంరాస్‌పేట: సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచులు

తెలంగాణ విద్యావంతుల వేదిక హర్షం

బొంరాస్‌పేట: తెలంగాణ మలిదశ ఉద్యమానికి ప్రతీకగా పేరుగాంచిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను.. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సముచిత స్థానం కల్పించడం పట్ల రాష్ట్ర విద్యావంతుల వేదిక నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ గవర్నర్ కోటాకింద ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం అహర్నిశలు ఆచార్య కృషి చేశారని గుర్తుచేశారు. అదే విధంగా విద్యాశాఖ మంత్రి పదవి ఆయన్ను వరించనుందన్న వార్తలు.. ఉపాధ్యాయ లోకానికి మరింత ఆనందాన్ని కలిగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర మహిళా కార్యదర్శి లక్ష్మి, జిల్లా నాయకులు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, విజయలక్ష్మి, అనిల్‌కుమార్, శ్రీప్రియ పాల్గొన్నారు.

గోసంరక్షణకు మహాపాదయాత్ర

కుల్కచర్ల: గోసంరక్షణ కోసం కుల్కచర్ల మండలం నుంచి శ్రీశైలం వరకు మహాపాదయాత్ర చేపట్టనున్నామని కార్యక్రమ కోఆర్డినేటర్ మోత్కూరు చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత హిందూ సమాజం ఆధ్వర్యంలో యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి ఆవులతో శివస్వాములు, గోసంరక్షణ కమిటీ సభ్యులు కలిసి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న సీఐ

తాండూరు టౌన్: పోగొట్టుకున్న మూడు సెల్ ఫోన్లను సాంకేతికత పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు అందజేసినట్లు తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ శనివారం తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో పోగొట్టుకున్న మొబైల్స్‌ను కనుగొన్నట్లు చెప్పారు. రికవరీ చేసుకున్న ఫోన్లను రామకృష్ణ, విజయేందర్, భీమ్‌లకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకున్న వారు ఫిర్యాదు చేస్తే.. ట్రేస్ చేస్తామని, ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు.

ఆర్థిక సహాయం

దోమ: మండల పరిధి రాకొండ గ్రామానికి చెందిన బండి రామయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.6,500 ఆర్థిక సహాయం అందజేశారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

సర్పంచుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ

మొయినాబాద్ రూరల్: యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ పేర్కొన్నారు. వారం రోజుల క్రితం ఆయా గ్రామాల్లోని యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ క్రీడలతో శరీరకంగా దృఢంగా ఉండడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సిద్ధయ్య, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రీతంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, వంశీరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సీఐ రాములు తదితరులు

కొడంగల్ రూరల్: చదువుతో పాటు కరాటేలో శిక్షణ పొందడం వలన ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఆత్మరక్షణకు దోహదపడుతుందని సీఐ రాములు అన్నారు. శనివారం పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ ఆవరణలో తైక్వాండో కరాటే నాన్‌చాక్ రాష్ట్ర కార్యదర్శి హెచ్.మనోహర్, మాస్టర్ సురేష్‌ల ఆధ్వర్యంలో తైక్వాండో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సీఐ రాములు, ఎస్ఐ భరత్‌రెడ్డి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం మాస్టర్ సురేష్ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఉచితంగానే శిక్షణ అందించనున్నామని, వారంలో రెండు రోజులు బుధవారం, శనివారం ఉదయం 6గంటల నుంచి 7–30వరకు జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

తాండూరు టౌన్: పట్టణంలోని నేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం సాంస్కృతిక వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ, సాంస్కృతిక నృత్యరూప ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ మణిమాల మాట్లాడుతూ.. విద్యార్థులకు బోధనతో పాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివలీల, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

భగ్గుమంటున్న ధరలు

పచ్చిమిర్చి రూ.60, గోరు చిక్కుడు 80

మోమిన్‌పేట: కూరగాయల ధరలు పైపైకి ఎగబాకుతుండటంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. రూ.500 వెచ్చించినా చేతి సంచినిండా కాయగూరలు రావడం లేదని వాపోతున్నారు. ఏ రకం వెజిటెబుల్ చూసినా కిలో రూ.60 పేనే రేటు పలుకుతోందని ఆవేదన చెందుతున్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సంతలో కిలో చొప్పున ధరలు ఇలా ఉన్నాయి. పచ్చిమిర్చి రూ.60, టమాట రూ.30, వంకాయ రూ.50, గోరు చిక్కుడు రూ.80, బీరకాయ, కాకర రూ.80, క్యారెట్ రూ.50, బెండకాయ కిలో రూ.60కి వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఇక ఆకు కూరల సంగతి సరేసరి. కట్టల లెక్కన చూస్తే రూ.100 పెట్టినా ఎంత రావటం లేదని కొనుగోలు దారులు తెలిపారు. కాగా.. పెరిగిన ధరలతో కిలో, అరకిలోకు బదులు.. పావుకిలో లెక్కన కొనడానికే ప్రజలు మొగ్గుచూపుతున్నారని అమ్మకం దారులు పేర్కొన్నారు.



క్రయవిక్రయ దారులతో మోమిన్‌పేట వారంతపు సంత

బీఆర్‌ఎస్ విస్మరిస్తే.. కాంగ్రెస్ గుర్తించింది

- మాజీ మంత్రుల వ్యాఖ్యలు సరికాదు
- ధారూరు పీఏసీఎస్ ఛైర్మన్ వైఎస్ఆర్



సత్యనారాయణరెడ్డి

ధారూరు: 'తెలంగాణ మలిదశ పోరాటాన్ని లేవదిసి, ప్రత్యేక రాష్ట్రం సిద్ధించే వరకు అలుపెరుగని పోరాటం చేసిన ఆచార్య కోదండరాంను బీఆర్‌ఎస్ విస్మరిస్తే.. కాంగ్రెస్ గుర్తించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించింది. దాన్ని కూడా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు తప్పుపట్టడం సరైంది కాదు' అని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం అనంతరం కోదండరామ్‌కు.. నాటి సీఎం కేసీఆర్ కలవడానికి కూడా సమయం ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు.

దాసోజితో కోదండరాంకు పోలికా?

దాసోజి శ్రావణ్ నాలుగు పార్టీలు మారిన వ్యక్తి అని, అలాంటి వ్యక్తిని కోదండరామ్‌తో పోల్చడం నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని, ఆ మంత్రులది బుద్ధి తక్కువ పని అని విమర్శించారు. అధికారం కోల్పోయి ఇంట్లో కూర్చున్న వారు.. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచించాల్సింది పోయి.. కోదండరామ్‌పై ఆరోపణలు చేయడం, కోర్టులో తేల్చుకుంటామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ సమాజం హర్షిస్తుంటే మాజీ మంత్రులు కోదండరామ్‌పై అవాకులు, చవాకులు పేలడం మంచిది కాదన్నారు. ఇలాంటి వాటికి తెరలేపితే బీఆర్‌ఎస్ పార్టీలో ఉండాలా వద్దా అనే ఆలోచనలో ఉన్నామని, ఇతర నాయకులు కూడా వీరి మాటలను జీర్ణించు కోలేకపోతున్నారని, నాయకులు, కార్యకర్తలను నిరుత్సాహ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకముందైనా చేసిన తప్పుల్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలని సూచించారు.

పదేళ్ల బానిసత్వానికి విముక్తి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి



పట్లోళ్ల రఘువీరారెడ్డి

ధారూరు: యాభై రోజుల్లోనే పదేళ్ల బానిసత్వం పోయిందని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియంతృత్వ పోకడలతో తెలంగాణలో ప్రజాపాలనను ఖూనీ చేసిన బీఆర్‌ఎస్‌కు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. విమర్శలు చేసిన వారే సిగ్గుపడాలని సూచించారు. ఖజాన ఖాళీగా ఉన్నా.. అధికారంలోకి వచ్చిన మొదటి వారంలోనే, ఉద్యోగులకు జీతాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని బీఆర్ఎస్ నాయకులు గుర్తించుకోవాలన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం వలన మహిళలు లబ్ధిపొందుతుంటే ఆ పార్టీ మాజీ మంత్రులు, నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రులైన కేటీఆర్, హరీశ్‌రావులకు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా.. ఇంకా వారి అహంకారం తగ్గలేదని విమర్శించారు. త్వరలోనే మిగతా గ్యారంటీల గురించి ప్రభుత్వం శుభవార్త చెప్పనుందని ఆయన వెల్లడించారు.

మానవ హక్కుల కమిటీ నియామకం

తాండూరు టౌన్: సమైఖ్య హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తాండూరు మండల కమిటీని వ్యవస్థాపక చైర్మన్ సాయికుమార్ గౌడ్ నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేందర్, మండల చైర్మన్‌గా ప్రవీణ్ కుమార్, కార్యవర్గ సభ్యుడిగా సునీల్ కుమార్, మహిళా జనరల్ సెక్రటరీగా అర్చనలను ఎనుకున్నారు. ఈ మేరకు శనివారం శంకర్‌పల్లిలోని కౌన్సిల్ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల చైర్మన్ మాట్లాడారు. మానసిక, శారీరక, లైంగిక వేధింపులు, వరకట్నం, కుల,మత, జాతి వివక్షలకు గురైన బాధితులకు అండగా నిలబడమే కౌన్సిల్ ప్రధాన లక్ష్యమని వివరించారు. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తప్పకుండా నెరవేరుస్తామని ఆయన అన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న ప్రవీణ్ కుమార్

సందర్శకులతో కోట్‌పల్లి కళకళ



ప్రాజెక్టు ఒడ్డున సేదతీరుతున్న పర్యాటకులు

ధారూరు: ఉరుకుల పరుగుల జీవితంలో కాసింత సేదతీరేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. శనివారం సెలవు దినం కాకున్నా.. కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు సందర్శకులు పోటెత్తారు. ఏడాది కాలంగా అటవీ అధికారుల నిరాకరణతో పర్యాటకుల సందడి లేక బోసి పోయిన జలాశయం.. వికారాబాద్ ఎమ్మెల్యే, స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ చొరవతో డిసెంబర్ 30న బోటింగ్ ప్రారంభించారు. ఫలితంగా గడిచిన నాలుగు వారాలుగా.. సందర్శకుల తాకిడితో ప్రాజెక్టు కళకళలాడుతోంది. వయోబేధం మరచి.. పర్యాటకులు బోటింగ్ చేస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

బడి బలోపేతమే లక్ష్యం

శ్రీరాంనగర్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంనగర్ సర్పంచ్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి కోరారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మానుక అశోక్ సొంత నిధులతో నిర్మించిన వేదికను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత అశోక్‌ను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులు వారు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఎంపీటీసీ రాంరెడ్డి, వార్డు సభ్యులు యాదయ్య, చంద్రయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీనుగౌడ్, పంచాయతీ కార్యదర్శి సజనామశ్రీ, శివశంకర్, జంగారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.